క్లుప్తంగా

మహాలక్ష్మి అమ్మవారికి వెండి హారం సమర్పణ



అమ్మవారికి ముత్యాల వెండి హారాన్ని సమర్పిస్తున్న మైహితోష్ దంపతులు

సీటీఆర్ఐ: శ్రావణ మాసం సందర్భంగా గాడాల గ్రామంలోని శ్రీమహాలక్ష్మి సమేత చిన్నవేంకటేశ్వరస్వామి పీఠాన్ని తిరుపతికి చెందిన విస్తార హోమ్స్ అధినేత, అనుగ్రహ ప్రద ఫౌండేషన్ ఇంటర్నేషనల్ వైస్ చైర్మన్ సింగం శెట్టి మైహితోష్, చేతన దంపతులు గురువారం సందర్శించారు. అమ్మవారికి పెద్ద ముత్యాలతో చేసిన వెండి హారాన్ని కానుకగా సమర్పించారు. పీఠాధిపతి డాక్టర్ చిన్నవేంకన్నబాబు వారికి ఆశీస్సులు అందజేశారు. మాతాజీ దుర్గావెంకట హేమావతి ఆ హారాన్ని అమ్మవారికి అలంకరించారు.

10 నుంచి సేవా కార్యక్రమాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పద్మ విభూషణ్ మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి జన్మదిన మహోత్సవాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చిరంజీవి యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న స్థానిక ఇన్నీసుపేట మున్సిపల్ స్కూల్ వద్ద ఉచిత వైద్య శిబిరం, 15న సీతానగరం మండలం ముగ్గళ్ల మెయిన్‌రోడ్‌లో రక్తదాన శిబిరం, 16న ధవళేశ్వరం రాజీవ్‌నగర్‌లో మొక్కలు నాటే కార్యక్రమం, 17న రోటరీ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరం, 18న రాజానగరంలో ఉచిత వైద్య శిబిరం, మొక్కలు నాటే కార్యక్రమం, 19న కోరుకొండలో మొక్కలు నాటే కార్యక్రమం, 20న రాజమండ్రి ధన్వంతరి బ్లడ్‌బ్యాంక్‌లో మెగా రక్తదాన శిబిరం, 21న కడియంలో ప్రత్యేక పూజా కార్యక్రమం, 22న రాజమండ్రిలో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు.

పోసికుమార్‌కు శ్రీకృష్ణదేవరాయ అవార్డు



అవార్డు అందుకుంటున్న ముత్యాల పోసికుమార్

ధవళేశ్వరం: తూర్పుగోదావరి జిల్లా కాపు జేఏసీ చైర్మన్ ముత్యాల పోసికుమార్ శ్రీకృష్ణదేవరాయ అవార్డును అందుకున్నారు. గురువారం గుంటూరు విజ్ఞాన మందిరంలో జరిగిన శ్రీకృష్ణదేవ రాయ పదో పట్టాభిషేక మహోత్సవంలో కాపు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస నాయుడు ఆయనను ఘనంగా సన్మానించి, అవార్డు అందజేశారు. స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడిగా సమాజానికి సేవ చేస్తున్న పోసికుమార్ కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా పోసికుమార్ మాట్లాడుతూ, ఇంతటి అరుదైన గౌరవం దక్కడం సంతోషంగా ఉందన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ఇన్నీసుపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండి, అప్రమత్తంగా ఉండాలని రాజమండ్రి టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శివగణేష్, ఎస్సై అశ్వక్ అన్నారు. గురువారం రాత్రి స్థానిక ఇన్నీసుపేటలో సైబర్ నేరాలు, ట్రాఫిక్, శక్తి యాప్, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లోన్, గేమ్ యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. తొందరపడి ఏ లింకులపై క్లిక్ చేయవద్దన్నారు. బ్యాంకు ఖాతాలో సొమ్ము కాజేసే సంఘటనలు ఇటీవల పెరిగిపోయాయని ఉదహరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	:	బకాసుర రెస్టారెంట్
సూర్యమినీ	:	మహావతార్ నరసింహ,
సూర్యప్యాలెస్	:	కింగ్‌డమ్
స్వామి	:	హరిహర వీరమల్లు
అనుశ్రీ	:	సుప్రమ్‌సో
శివజ్యోతి	:	సార్ మేడమ్
రాజా	:	కింగ్‌డమ్
ఊర్వశి	:	మహావతార్ నరసింహ
మేనక	:	రాజుగాని సవాల్
రంభ	:	జూనియర్
అప్సర	:	కింగ్‌డమ్
అశోక	:	కింగ్‌డమ్
నామవరం		
వీఎస్ మహల్	:	మహావతార్ నరసింహ
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	మహావతార్ నరసింహ
కడియం		
వెంకటసూర్య	:	మహావతార్ నరసింహ

చదువుకు పదును



సమావేశానికి హాజరైన కమిటీ సభ్యులు



విద్యా ఫోరమ్ విధి విధానాలను వివరిస్తున్న విద్యాశాఖాధికారులు

- విద్యా ఫోరమ్‌తో సర్కారీ బడులకు మద్దతు
- 30 మందితో మండల అకడమిక్ ఫోరమ్ ఏర్పాటు
- కమిటీ సభ్యులకు విధి విధానాలపై సమావేశాలు

కంబాలచెరువు: విద్యార్థుల అభ్యసన స్థాయి గుర్తించేందుకు, విద్యలో అందుతున్న నాణ్యతను నిర్ధారించడానికి.. క్షేత్ర స్థాయి విద్యా మద్దతును అందించే దిశగా విద్యా ఫోరమ్‌లు ఏర్పాటవుతున్నాయి. ఇందులో భాగంగా విద్యా శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో మండల స్థాయిలో విద్యా ఫోరమ్ ఏర్పాటైంది. ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. దీనిలో ఆచరించాల్సిన అంశాలను స్థానిక విద్యా శాఖాధికారులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, విధివిధానాలపై చర్చించారు.

నాణ్యతతో కూడిన విద్యకు..

విద్యా ఫోరమ్ పనిచేసే విధానాలు పూర్తి నాణ్యతతో ఉంటాయి. ఈ ఫోరమ్ తరగతి గదిలో బోధనా పద్ధతులను పర్యవేక్షిస్తుంది. అలాగే శిక్షణ, వనరుల విస్తరణలో సహాయం చేయడానికి పాఠశాలలతో మమేకమై పని చేస్తుంది. విద్యా కార్యక్రమాల అమలులో క్రమశిక్షణను నిర్ధారించడానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తుంది. విద్యా క్యాలెండర్‌లో పేర్కొన్న విధంగా క్షేత్ర స్థాయిలో అన్నీ అమలవుతున్నాయో, లేదో పరిశీలించాలించే బాధ్యత విద్యా ఫోరమ్‌దే. అలాగే నో బ్యాగ్ డే రోజుల్లో విద్యార్థులు ఎలా వస్తున్నారనే దానిపై నిశితంగా పరిశీలించాలి. దానికి తగ్గట్టుగా మార్పులుంటే సూచనలు చేయాలి. డైట్ విద్యార్థి, ఉపాధ్యాయులు ఒకటి నుంచి తొమ్మిది విద్యార్థులకు తగిన కార్యకలాపాలను నిర్వహిస్తున్నారో లేదో గమనించాలి. క్లాస్ టీచర్లు అకడమిక్ నిబంధనల ప్రకారం విద్యార్థి మూల్యాంకన బుక్‌లెట్లను సమర్థవంతంగా నిర్వహించాలి. ఆ పని సక్రమంగా అవుతుందో లేదో చూడాలి. ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచడానికి చురుకైన చర్యలు తీసుకోవాలి. మండల అకడమిక్ ఫోరం వారానికి రెండు సార్లు క్షేత్ర సందర్శన చేయడం ద్వారా పాఠశాలలను పర్యవేక్షించాలి. అభ్యసన ఫలితాలను మెరుగుపర్చడంపై దృష్టి సారిస్తుంది విద్యాఫోరమ్. వారానికి ఒకసారి క్రమం తప్పకుండా సమావేశాలను నిర్వహించి, వారు చేస్తున్న పర్యవేక్షణను సమీక్షించి, వారి పర్యవేక్షణ నివేదికలను జిల్లా ఫోరమ్‌కు మండల విద్యా ఫోరమ్ పంపించాల్సి ఉంటుంది.

ఫోరమ్ కమిటీ ఇలా..

- చైర్‌పర్సన్‌గా మండల విద్యాధికారి – 1
- కన్వీనర్, సభ్యుడిగా మండల విద్యాధికారి – 2
- సభ్యులుగా క్లస్టర్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్లు 8 మంది, సీఎంఆర్‌టీలు 8 మంది, సెంకడరీ స్థాయి సబ్జెక్టు నిపుణులు ఏడుగురు, ప్రాథమిక స్థాయి నైపుణ్య ఉపాధ్యాయులు ఐదుగురు మండల విద్యా ఫోరమ్‌లో ఉంటారు.

విద్యా ఫోరమ్ చాలా ఉపయుక్తం



విద్యార్థుల అభ్యసన స్థాయి, లెర్నింగ్ అవుట్ కమ్స్‌ని ఎప్పటికప్పుడు విద్యా ఫోరమ్ గుర్తిస్తుంది. ఉపాధ్యాయులకు అకడమిక్ అంశాలపై సూచనలు ఇచ్చేందుకు మండల అకడమిక్ ఫోరం ఉపయుక్తంగా ఉంటుంది. ఫోరం కమిటీ చేయాల్సిన విధివిధానాలపై సమావేశాలు నిర్వహించి సూచనలు చేస్తున్నాం.

– బి.దిలీప్‌కుమార్, అర్బన్ రేంజ్ డీఐ, రాజమహేంద్రవరం

చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఏడీసీ రామలింగేశ్వర్



అధికారులతో మాట్లాడుతున్న ఏడీసీ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: పారిశుద్ధ్య నిర్వహణ, తడి, పొడి చెత్త సేకరణపై అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. గురువారం కుమారీ టాకీస్ రోడ్డు, త్యాగరాజ గానసభ రోడ్లలో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. కూలిన డ్రైన్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాల్సిందిగా ఇంజినీరింగ్ అధికారులకు నిర్దేశించారు. పారిశుద్ధ్య కార్మికులు ఉదయం మస్టర్ అనంతరం మెయిన్ రోడ్లు స్వీపింగ్ చేసి, మైక్రో పాయింట్ల మేరకు ఇంటింటి చెత్త సేకరణ చేయాలన్నారు. ఇంకా కొంత మంది తడి, పొడి చెత్తను వేర్వేరుగా కాకుండా కలిపే ఇస్తున్నారని, దీనిపై పారిశుద్ధ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మధ్యాహ్నం సమయంలో డివిజన్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలను, డ్రైన్లను గ్యాంగ్ వర్క్ ద్వారా శుభ్రం చేయించాలని ఆదేశించారు. అలాగే తరచూ వ్యర్థాలు వేసే ప్రదేశాలను గుర్తించి, ఆయా ప్రదేశాల్లో డస్ట్‌బిన్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయన వెంట ప్రజారోగ్య అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యమివ్వాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి



క్యాంటీన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: సేవల నాణ్యతను మెరుగుపర్చడంలో ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యమివ్వాలని జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి వద్దనున్న అన్న క్యాంటీన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టోకెన్ కౌంటర్, డైనింగ్ ఏరియా, చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశాలను పరిశీలించారు. భోజనం చేస్తున్న వారితో కలెక్టర్ మాట్లాడారు. భోజన నాణ్యత, పరిశుభ్రత, వసతుల లభ్యత, సమయ పాలన, అందుబాటులో టోకెన్లు తదితర అంశాలపై ఆరాతీశారు. అన్న క్యాంటీన్ల నిర్వహణలో ఎటువంటి లోపాలు ఉండరాదని, సమయ పాలన కచ్చితంగా పాటించాలని, ప్రజల నుంచి ఆహారం అందకపోయినట్లు ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. క్యాంటీన్ నిర్వహణ విషయంలో ప్రజల అభిప్రాయాలు క్యూఆర్ కోడ్ ద్వారా సేకరించవచ్చని తెలిపారు. క్యాంటీన్ల నిర్వహణపై నోడల్ అధికారులదే పూర్తి బాధ్యత అని, నిరంతర పర్యవేక్షణ ఉండాలని నిర్దేశించారు.

తొలి దశలోనే క్యాన్సర్ గుర్తింపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సౌభాగ్యలక్ష్మి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): తొలిదశ క్యాన్సర్‌ను స్క్రీనింగ్ ద్వారా గుర్తించవచ్చని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సౌభాగ్యలక్ష్మి మాట్లాడుతూ, క్యాన్సర్ చికిత్స ఇప్పుడు మరింత సులభమని, వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలన్నారు అప్పుడే చికిత్స చేస్తే త్వరగా స్వస్థత చేకూరుతుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రుల్లో స్క్రీనింగ్ పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించడం సాధ్యమవుతుందన్నారు. తద్వారా చికిత్స సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో నాన్ కమ్యూనికల్ డీసీజెస్ సెల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిచంద్రప్రసాద్, జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్, ఇతర వైద్యాధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న శ్రీలక్ష్మి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విద్యార్థులు చదువుపై ఆసక్తి కలిగి ఉండాలని, నిరంతరం వివిధ విషయాలపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక వీరభద్రపురంలోని మున్సిపల్ టౌన్ హైస్కూల్‌లో సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లల అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకుని కొందరు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని మోసపూరితంగా అక్రమ కార్యకలాపాలకు వాడుకుంటున్నారని, పిల్లలు జాగ్రత్తగా ఉండాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థ పిల్లలకు అందిస్తున్న సేవలను వివరించారు. ఎటువంటి న్యాయ సమస్యలు ఎదురైనా తమను సంప్రదించాలన్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజన పథకంలో అందిస్తున్న భోజనాన్ని ఆమె పరిశీలించారు.

తల్లిపాల ప్రాధాన్యాన్ని గుర్తించాలి



దుళ్లలో ర్యాలీని ప్రారంభిస్తున్న సర్పంచ్ పట్టియ్య

కడియం: ప్రతి ఒక్కరూ తల్లిపాల ప్రాధాన్యాన్ని గుర్తించాలని, బిడ్డలకు తల్లిపాలు మాత్రమే అందించాలని దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం దుళ్లలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సర్పంచ్ పట్టియ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలింతలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు కట్టుంగ నాగరాజు, మాజీ సర్పంచ్‌లు గుర్రపు సత్యనారాయణ, చిట్టూరి అమ్మిరాజు, ప్రభుత్వ వైద్యులు జెస్సీ సుప్రియ, సంఘ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాస రావు, నాయకులు పి. దేవానందం, రహమాన్ ఖాన్, యు.ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

బిడ్డకు తొలి టీకా



రాజమహేంద్రవరంలో జరిగిన వారోత్సవాల్లో మాట్లాడుతున్న బేబీరాణి

రాజమహేంద్రవరం సిటీ: పుట్టిన బిడ్డకు తల్లిపాలు టీకాతో సమానమని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ బేబీ రాణి అన్నారు. గురువారం అన్నపూర్ణమ్మపేట-4, తుమ్మలావ-1, కోర్లమ్మపేట అంగన్‌వాడీ మెర్జ్ సెంటర్లలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీ రాణి మాట్లాడుతూ, పుట్టిన బిడ్డకు అరగంట లోపులో ముర్రు పాలు పట్టించాలని, తర్వాత ఆరు నెలల వరకు తల్లిపాలు మినహా ఇతర ఏ ఆహారం అందించరాదన్నారు. తల్లిపాలు బిడ్డకు రోగ నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. తల్లిపాలకు మద్దతు నిచ్చే స్థిరమైన వ్యవస్థలను ఏర్పాటు చేసి, తల్లి పాల సంస్కృతి ప్రోత్సాహానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తల్లి పాలు శ్రేయస్కరం



కంబాలపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

కంబాలచెరువు: బిడ్డకు తల్లి పాలు శ్రేయస్కరమని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. కంబాలపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. తల్లి పాలకు ప్రత్యామ్నాయమే లేదన్నారు. డీఐఓ డాక్టర్ పి.కోమల, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పి.సరిత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బిందు, హాస్పిటల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ ఎ.శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యవేణి, డీడీ భవానీ, జీఎస్ఎల్ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

స్కూటీ చోరీ

రాజమహేంద్రవరం రూరల్: బార్ ముందు పార్కింగ్ చేసిన తన స్కూటీ అపహరణకు గురైందని లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన పి.శ్యామ్‌కుమార్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం రాత్రి లాలాచెరువులోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ ముందు శ్యామ్‌కుమార్ తన స్కూటీని పార్కింగ్ చేసి లోనికి వెళ్లాడు. తిరిగొచ్చేసరికి స్కూటీ లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. బొమ్మూరు ఎస్సై మురళీమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమన్వయంతో విజయవంతం చేయాలి



సమావేశానికి హాజరైన వివిధ శాఖల సిబ్బంది

కడియం: ప్రతి ప్రజాహిత కార్యక్రమాన్ని ప్రభుత్వ సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. ఈ నెల 12న జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కె.రమేష్‌బాబు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ జెస్సీ సుప్రియ, ఎం.మణిజ్యోత్స్న మాట్లాడుతూ 1–19 ఏళ్ల పిల్లలు, కిశోర బాలికలకు ఒక మాత్రను పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తారన్నారు. మాత్రను చప్పరించాక పరిశుభ్రమైన మంచినీరు తాగాలన్నారు. నులి పురుగుల సంక్రమణ ఎక్కువగా ఉన్న పిల్లలు మాత్ర వేశాక కొంత వికారం, వాంతులు, కడుపునొప్పి, విరేచనాలు, నీరసం వస్తాయన్నారు. కొద్దిసేపు మాత్రమే ఇలా ఉంటుందన్నారు. ఇటువంటి పరిస్థితి ఎదురైతే తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని వైద్యులు చెప్పారు. వైద్యారోగ్య శాఖ, విద్యా, స్త్రీ–శిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయన్నారు. సమావేశంలో ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



ఎస్‌కేవీటీ కాలేజీలో విద్యార్థినుల చేనేత వస్త్రాల ఫ్యాషన్ వాక్



మురమండలో నేత కార్మికులను సత్కరిస్తున్న రవికుమార్ తదితరులు



కాతేరులో చేనేత సొసైటీ సభ్యులను సత్కరిస్తున్న నాయకులు

కడియం: జాతీయ చేనేత దినోత్సవం మండలంలోని మురమండలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత రంగంలో సేవలందిస్తున్న ఐదుగురిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా చేనేత అభివృద్ధి అధికారి సీహెచ్ రవికుమార్ మాట్లాడుతూ, మురమండ, పులగుర్త, వడిశలేరు గ్రామాల్లో చేనేత క్లస్టర్ పథకం అమలుతో సుమారు 850 మంది నేత కార్మికులకు లబ్ధి చేకూరుతోందన్నారు. జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ పథకంతో ఉత్పత్తుల ధరలు తగ్గి కార్మికులకు ప్రత్యక్షంగా లబ్ధి కలుగుతోందన్నారు. చేనేత కేంద్రం నిర్వాహకులు జీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ, మురమండ గ్రామానికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ గుర్తింపు రావడం గర్వకారణమని, దీని ద్వారా చేనేత ఉత్పత్తులకు ప్రాధాన్యం పెరుగుతుందన్నారు. డీసీసీబీ బ్రాంచి మేనేజర్ టి.లక్ష్మీతులసి మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ దేవళ్ల రామ్మోహనరావు, సర్పంచ్ అయినవిల్లి రుక్మిణి తదితరులు మాట్లాడారు. నేత ఉత్పత్తుల ప్రదర్శన, చేనేత కళపై వర్క్‌షాప్ నిర్వహించారు. నేత కార్మికులు కొమ్మన పాపాయమ్మ, జట్ల నాగసత్యవతి, పిచ్చిక సుబ్బారావు, దైవపు బూరయ్య, దొంతంశెట్టి మల్లేశ్వరరావును ఘనంగా సత్కరించారు.

అండగా నిలవాలి

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి కార్మికులకు అండగా నిలవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. కాతేరు గ్రామంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత సహకార సొసైటీ సభ్యులను పిక్కి నాగేంద్ర, రాష్ట్ర ఓబీసీ సంఘ అధ్యక్షులు రొంగల గోపి శ్రీనివాస్, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా మాజీ అధ్యక్షుడు బొమ్ముల దత్తు తదితరులు ఘనంగా సత్కరించారు. ఏఎంసీ డైరెక్టర్లు గంగిన జాహ్నవి, పన్నాల వెంకటలక్ష్మి, మద్దిపాటి రజని, తనుబుద్ధి సూర్యభాస్కరరావు, స్వామి సూర్యకిరణ్, బండి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను ధరించాలి

సీటీఆర్ఐ: ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి.. చేనేత కళాకారులకు అండగా ఉండాలని ఎస్కేవీటీ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవకుమారి అన్నారు. స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవకుమారి అధ్యక్షత వహించారు. వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. చేనేత వస్త్రాలతో చేసిన ఫ్యాషన్ వాక్ ఆకట్టుకుంది. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మసీదు కమిటీకి ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సలీం, బాషా తదితరులు

కడియం: గ్రామంలోని మస్‌జిద్–ఎ–కౌసర్ కమిటీకి సత్వరం ఎన్నికలు నిర్వహించాలని మసీదు మాజీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ సలీం, సర్కార్ బాషా కోరారు. మసీదు వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు కమిటీ సభ్యులతో కలిసి వారు మాట్లాడారు. మసీదు అభివృద్ధికి తమ పదవీకాలాన్ని ఆరు నెలలు పొడిగించి, తర్వాత ఎన్నికలు నిర్వహించాలని వక్ఫ్ బోర్డ్‌కు గతంలోనే తాము విన్నవించుకున్నామన్నారు. టీడీపీ నాయకులు పైరవీలు చేసి, కొత్తగా నామినేటెడ్ కమిటీని ప్రకటిస్తున్నారన్నారు. మసీదు సభ్యులంతా తమ ప్యానెల్‌వైపే ఉన్నారన్నారు. సభ్యుల అభిప్రాయానికి విరుద్ధంగా టీడీపీ నాయకులు వ్యవహరించడం దారుణమన్నారు. తాము పార్టీలకతీతంగా మసీదు అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అయినప్పటికీ రాజకీయాలు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎన్నికలు నిర్వహిస్తే మసీదు సభ్యుల అభిప్రాయం ఏమిటో వ్యక్తమవుతుందన్నారు.

ఉత్సవ కమిటీలు నిబంధనలను పాటించాలి



దుళ్లలో ఉత్సవ కమిటీలతో మాట్లాడుతున్న ఎస్సై దుర్గాప్రసాద్

కడియం: వినాయక ఉత్సవ మంటపాల వద్ద నిర్దేశించిన నిబంధనల మేరకు వ్యవహరించాలని కడియం ఎస్సై దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని దుళ్లలో వినాయక ఉత్సవ కమిటీలకు గురువారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, మంటపాల వద్ద విద్యుత్, అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే ఉత్సవాల్లో భాగంగా ఎటువంటి అసాంఘిక, అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేయరాదన్నారు. ఉత్సవ ఊరేగింపుల సమయంలో బైక్ రైడింగ్‌లు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎటువంటి ఉద్రిక్తతలకు తావు లేకుండా, శాంతిభద్రతలను కాపాడే విధంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో హెచ్‌సీ సీహెచ్‌వీ రమణ పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రమైన కడియంలో జరిగిన అవగాహన సమావేశంలో ఉత్సవ కమిటీలకు ఎస్సై ధనలక్ష్మి పలు సూచనలు చేశారు.